సాగుకు సాంకేతిక సాయం!

- రైతులకు వెన్నుదన్నుగా నిలవనున్న డ్రోన్లు
- మందుల పిచికారీలో సమయం, డబ్బు ఆదా


మిరప పంటకు మందులు పిచికారీ చేస్తున్న డ్రోన్

ఆలూరు రూరల్: ఆధునిక కాలంలో సాంకేతిక పరిజ్ఞానం కొత్త ఆవిష్కరణలకు నాంది పలుకుతోంది. వ్యవసాయ రంగానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి యాంత్రీకరణకు రాష్ట్ర ప్రభుత్వ పెద్దపీట వేసింది. నారు వేయడం నుంచి కోత వరకు రైతులు సైతం యాంత్రీకరణ వైపు ఆసక్తి చూపిస్తున్నారు. ఆ దిశగానే వ్యవసాయ రంగంలో డ్రోన్లను అందుబాటులో తెచ్చింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. దీంతో సమయం, డబ్బు ఆదా అవుతుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆలూరు వ్యవసాయ సబ్ డివిజన్‌లోని 5 మండలాలు ఉన్నాయి. మండలానికి మూడు డ్రోన్ల చొప్పున ప్రభుత్వం కేటాయించింది. ప్రస్తుతం మండలానికి ఒక డ్రోన్ చొప్పున మంజూరయ్యాయి. ఈ ఏడాది ఖరీఫ్ నాటికి డ్రోన్లు పంపిణీ చేస్తామని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

40 శాతం రాయితీతో డ్రోన్లు

వ్యవసాయంలో రైతులకు యంత్రాలు బాగా సాయపడుతున్నాయి. పంటలకు ఆశించిన తెగుళ్లను కాపాడుకునే సమయంలో పురుగు మందులు పిచికారీ చాలా అవసరం. సకాలంలో స్ప్రేయర్లు దొరకక, కూలీలు రాక పంటలు నష్టపోయిన కాలాలు ఉన్నాయి. పిచికారీ చేసే సమయంలో రైతులు మృత్యువాతపడిన సందర్భాలు లేకపోలేదు. వీటిని అధికమించేందకు రాష్ట్ర ప్రభుత్వం డ్రోన్లను అందుబాటులో తెచ్చింది. రైతు భరోసా కేంద్రం పరిధిలో 5 మంది రైతులు గ్రూపుగా ఉండి డ్రోన్ కోసం వ్యవసాయ అధికారులకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందులో అగ్రికల్చర్ బీఎస్సీ లేదా ఇంజినీరింగ్ చదివిన రైతు గాని, గ్రామస్తుడు గాని సభ్యుడై ఉండాలి. 5 నుంచి 10 లీటర్ల సామర్థ్యం ఉన్న డ్రోన్ ధర రూ.6 నుంచి 10 లక్షలు ఉంది. జిల్లా సహకారం పరపతి సంఘం బ్యాంకు ద్వారా 40 శాతం రాయితీతో ప్రభుత్వ డ్రోన్లను మంజూరు చేస్తోంది. మిగిలిన 60 శాతం నగదు రైతులు కంతుల రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. ఆ గ్రూపు సభ్యుల అనుమతితో వీటిని ఇతర రైతులకు బాడుగకు కూడా ఇచ్చుకోవచ్చు.

ఐదు నిమిషాల్లో ఎకరా పొలం పిచికారీ

పత్తి, మిరప, జొన్న, వరి, కూరగాయలు, ఉద్యానవన పంటలకు ఆశించిన పురుగులను నివారించుకోవడానికి డ్రోన్ల ద్వారా పిచికారీ చేస్తారు. 10 లీటర్ల సామర్థ్యం ఉన్న డ్రోన్ 5 నిమిషాల వ్యవధిలో ఎకరా పొలం పంటపై పురుగు మందు పిచికారీ చేస్తోంది. అలాగే పంటలు ఎండిపోతున్నప్పుడు వీటి ద్వారా మొక్కలపై నీటిని పిచికారీ చేసి కాపాడుకోవచ్చు. వర్షాలు పడినప్పుడు బురదలో పిచికారి చేయడం ఇబ్బంది ఉంటుంది. ఆపరేటర్ ద్వారా డ్రోన్‌తో పిచికారీ చేయవచ్చు.

పది నిమిషాల్లో పిచికారీ



డ్రోన్ సాయంతో ఎకరానికి కేవలం పది నిమిషాల్లో పురుగుల మందు పిచికారీ చేయవచ్చు. రోజుకి 20 నుంచి 25 ఎకరాల్లో స్ప్రేయింగ్ చేస్తోంది. డ్రోన్ ద్వారా మందు పైరుపై సక్రమంగా పడుతుంది. నెల రోజుల పాటు నాకు డ్రోన్ ఆపరేటింగ్‌పై శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ అందించారు.

– షేక్షావలి, డ్రోన్ పైలెట్, హత్తిబెళగల్ గ్రామం, ఆలూరు మండలం

రైతులను ప్రోత్సహిస్తున్నాం



పత్తి, మిరప, వేరుశనగ, ఉద్యానవన పంటలకు ఆశించిన పురుగుల నివారణకు డ్రోన్‌తో పిచికారీ విధానం వైపు మొగ్గు చూపాలని రైతులను ప్రోత్సహిసిస్తున్నాం. ఇప్పటి వరకు సబ్ డివిజన్‌లో మండలానికి ఒక డ్రోన్ మంజూరు చేశాం. ఆపరేటర్లుకు కూడా ట్రెనింగ్ ఇచ్చి సర్టిఫికేట్ అందించాం. ఒకే రోజు 25 ఎకరాలకు స్ప్రేయింగ్ చేయవచ్చు. రైతులకు లాభసాటిగా ఉంటుంది.

– సునీత ఏడీఏ, ఆలూరు

క్లుప్తంగా

గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు


స్కానింగ్ పరీక్షల కోసం సీహెచ్‌సీకి వచ్చిన గర్భిణులు

ఆలూరు రూరల్: ప్రతి నెల 9వ తేదీన గర్భిణులకు నిర్వహించే స్కానింగ్ పరీక్షలను స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మంగళవారం జరిగాయి. వివిధ గ్రామాల నుంచి వచ్చిన గర్భిణులకు బీపీ, షుగర్, హిమోగ్లోబిన్ శాతం తదితర పరీక్షలు చేశారు. రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులకు ఐరన్ ట్యాబ్లెట్లు అందించారు. 65 మంది గర్భిణులకు పరీక్షలు నిర్వహించినట్లు వైద్యులు తెలిపారు.

సమన్వయంతో విధులు నిర్వర్తించాలి

మద్దికెర: అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించి విద్యార్థుల వివరాలు సేకరించాలని ఎంపీడీఓ నరసింహమూర్తి, ఎంఈఓ రంగస్వామి తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో విద్యార్థుల గుర్తింపు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాలలో పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు, బడి మానేసిన విద్యార్థులు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి మధ్యలో చదువు మానేసిన విద్యార్థుల వివరాలు సక్రమంగా సేకరించాలన్నారు. ప్రతిఒక్కరూ ఉన్నత చదువులు చదవాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి సుధాకర్, ఉపాధ్యాయులుగోపాల్, ఆంజనేయులు, సంక్షేమ అధికారులు, అంగన్‌వాడీకార్యకర్తలుపాల్గొన్నారు.

ఆర్జీటీ సెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

గోనెగండ్ల: ప్రభుత్వ పాఠశాలలో చదివి పదవ తరగతి ఫలితాలలో 500 పైగా మార్కులు సాధించిన విద్యార్థినీ, విద్యార్థుల నుంచి ఆర్జీటీ సెట్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆర్జీటీ ఏటీఎల్ సుబ్రహ్మణ్యం తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆర్జీటీ సెట్‌లో ఉత్తీర్ణులైన వారికీ ఇంటర్‌తో కలుపుకొని 6 సంవత్సరాల వరకు సంస్థ ఉచితంగా చదివిస్తుందన్నారు. అర్హులైన విద్యార్థులు ఈనెల 15తేదీలోపు ఎమ్మిగనూరు ఆర్జీటీ ఫీల్డ్ ఆఫీస్‌లో దరఖాస్తులను అందజేయాలన్నారు. దరఖాస్తుచేసుకున్నవిద్యార్థులకు(ఆర్జీటీసెట్) ఈ నెల 29న ఆదోనిలో పరీక్ష నిర్వహిస్తామన్నారు.

పొదుపు సంఘాలు బలోపేతం కావాలి

మద్దికెర: పొదుపు సంఘాలు మరింత బలోపేతం అయ్యేందుకు చర్యలు చేపట్టాలని ఏపీఎం సూర్యప్రకాష్ తెలిపారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ క్రాంతిపథకం కార్యాలయంలో రెండవరోజు లోకాస్ యాప్‌పై వీబీకేలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాతూ సంఘాలలో పొందిన రుణాలతో మహిళలు స్వయం ఉపాధి కల్పించుకుని పలువురికి ఆదర్శంగా నిలవాలన్నారు. ప్రభుత్వం అందించే సబ్సిడీ పథకాలు సద్వినియోగం చేసుకొని మరింత అభివృద్ధి చెందాలన్నారు.

ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్ క్లాసులు

గోనెగండ్ల: మండల కేంద్రం గోనెగండ్లలోని మండల పరిషత్ ప్రాథమిక(బస్టాండ్) పాఠశాలలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం నుంచి ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్ క్లాసులు ప్రారంభిస్తామని ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్ నరసింహులు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వేసవి సెలవులలో 5వ తరగతి నుంచి డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్ క్లాసులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే బోధన ఉంటుందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్యార్థుల వివరాలు పక్కాగా ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఎం బాషా

తుగ్గలి: ఇంటింటా సర్వేలో విద్యార్థుల వివరాలు పక్కాగా నమోదు చేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఎస్‌ఎంబాషా తెలిపారు. స్థానిక ఎమ్మార్సీలో మంగళవారం వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులతో తహసీల్దార్ రవి, ఎంఈవో రామవెంకటేశ్వర్లుతో కలిసి ఎంపీడీఓ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బుధవారం నుంచి చేపట్టే ఇంటింటి సర్వేలో ప్రతి ఇంటికి వెళ్లి వారి పిల్లల వయసు, ఏ పాఠశాలలో ఏ తరగతి చదువుతున్నారు, బడిమానేశారా అనే వివరాలను వలంటీర్లు సేకరించాలన్నారు. నిర్లక్ష్యం వహించకుండా పక్కాగా విద్యార్థుల వివరాలు నమోదు చేయాలన్నారు.

లోకోస్ యాప్‌పై అవగాహన

తుగ్గలి : స్థానిక స్త్రీశక్తి భవనంలో మంగళవారం రెండో రోజు వీవోఏలకు లోకోస్ యాప్‌పై వైకేపీ ఏపీఎం రాధాకృష్ణ, సీసీలు రవి, శేఖర్ శిక్షణ ఇచ్చారు. యాప్ ఎలా వినియోగించాలనే విషయాలపై అవగాహన కల్పించారు. పొదుపు మహిళలు పిల్లలను చదివించుకోవాలని, తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలని సూచించారు.

పట్టుబడిన వాహనాల వేలం

ఎమ్మిగనూరురూరల్: సెబ్ సర్కిల్ పరిధిలోని పట్టుబడిన 15 వాహనాలకు మంగళవారం నంద్యాల సెబ్ సూపరిండెంట్ శ్రీధరరావు ఆధ్వర్యంలో సెబ్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో వేలాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 వాహనాలకు వేలాలు నిర్వహిచటం జరిగిందని చెప్పారు. మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ నిర్ణయించిన ధర రూ. 1,78,.000 కాగా పోటీలో రూ.3,17,500 వచ్చిందని, అలాగే జీఎస్టీ కింద మరో రూ. 57,100 వసూలైనట్లు తెలిపారు. కార్యక్రమంలో సెబ్ సీఐ జయరాంనాయుడు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

కృష్ణగిరి: మండల పరిధిలోని తాపలకొత్తూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన శివాలయంలో విశ్వేశ్వరస్వామి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవాలు బుధవారం నుంచి మూడు రోజులుపాటు నిర్వహిస్తామని గ్రామస్తులు తెలిపారు. ఉదయం 8గంటలకు గణపతిపూజతో ప్రతిష్ట ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. దేవాలయ ఆవరణలో అర్చకుల ఆధ్వర్యంలో హోమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

గ్యాస్ కోసం పడిగాపులు

హొళగుంద: భారత్ గ్యాస్ కోసం వినియోగదారులు మంగళవారం గంటల తరబడి పడిగాపులు కాశారు. ప్రతి మంగళవారం డెలివరీ చేయడానికి ఆదోని నుంచి హొళగుందకు వస్తున్న సదరు గ్యాస్ వాహనం సమయ పాలన పాటించకపోవడంతో వినియోగదాలరులు నిరీక్షించాల్సి వస్తుంది. మంగళవారం ఎండలో పడిగాపులు కాసిన పలువురు గ్యాస్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డోర్ డెలివరీ చేయకుండా ఒక చోట వాహనాన్ని నిలబెట్టడమే కాకుండా సిలెండర్ ధర రూ.1174.50 ఉంటే రూ. 1,230 ఎలా వసూలు చేస్తున్నారని వినియోగదారులు ప్రశ్నించారు.

జగనన్న పాలనలో గడపగడపకూ సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి


సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండ రూరల్ : సీఎం జగనన్న పాలనలో గడపగడపకూ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. మండల పరిధిలోని చందోలి గ్రామంలో మంగళవారం ఎమ్మెల్యే శ్రీదేవి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించడంతోపాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో ప్రజాసంక్షేమ పథకాలను పక్కదారి పట్టించేవారన్నారు. నేడు సీఎం జగన్మోహన్‌రెడ్డి సారథ్యంలో పార్టీలకు అతీతంగా నేరుగా అర్హులైన ప్రజలందరికీ పారదర్శకంగా పథకాలు అందుతున్నాయన్నారు. ప్రజల వద్దకే పాలన సాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వాదించాలని ప్రజలను ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ నారాయణదాస్, చందోలి గ్రామ నాయకులు క్రిష్టారెడ్డి, రవిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, రామన్న, బాలన్న, వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ అధికార ప్రతినిధి శ్రీరంగడు, మండల కన్వీనర్ కారం నాగరాజు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌నాయక్, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యురాలు కేశ సుభాషిణి

కృష్ణగిరి: అధికారులు బాధ్యతాయుతంగా పని చేసినప్పుడే మండలం అభివృద్ధి బాటలో పయనిస్తుందని జెడ్పీటీసీ సభ్యురాలు కేశ సుభాషిణి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల ఉపాధ్యక్షురాలు సరోజ ఆధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ముందుగా అన్ని శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను వినిపించారు. అనంతరం జెడ్పీటీసీ కేశ సుభాషిణి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ అందేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మూడు నెలలకు ఒకసారి జరుపుకునే సర్వసభ్య సమావేశానికి కూడా కొందరు అధికారులు రావడం లేదని, మరి కొందరు తమ నివేధికలు చదివిన వెంటనే వెళ్లిపోవడం సరికాదన్నారు. అధికారుల తీరు మార్చుకోకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లుతామని హెచ్చరించారు. గ్రామాల్లో ఏ సమస్య ఉన్నా ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, తన దృష్టికి తీసుకవస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధ్యక్షురాలు బోయ సరోజ మాట్లాడుతూ వేసవి దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో కూలీలందరికీ పనులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. కటారుకొండ, బోయబొంతిరాళ్ల సర్పంచ్‌లు లెనిన్‌బాబు, రవిమోహన్ తమ గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని, కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని కోరారు. అలాగే కటారుకొండ ఎంపీటీసీ మురళీధర్‌రెడ్డి తాపలకొత్తూరు గ్రామంలో తాగు నీటి సమస్య అధికంగా ఉందని, అలాగే మా గ్రామానికి వచ్చే రహదారిని నిర్మించాలని సభ దృష్టికి తీసుకవచ్చారు. సభ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను జెడ్పీటీసీ సభ్యురాలు ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీఓ మోహన్‌కుమార్, తహసీల్దార్ పురుషోత్తం, మండల కో–అప్షన్ సభ్యుడు షేక్ షాలుమియ్యా, వైస్ ఎంపీపీ–2 రాజేష్, పత్తికొండ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మాదవరావు, పీఆర్ ఏఈ అబ్దుల్‌వహీద్, ఏఓ వెంకటేశ్వర్లు, ట్రాన్స్‌కో ఏఈ మద్దిలేటి, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల కట్టడికి కృషి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

ఆలూరు రూరల్: బాల్య వివాహాలు అరకట్టేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు క్షేత్రస్థాయిలో ప్రజలను చైతన్య పరచాలని సచివాలయాల జిల్లా కో–ఆర్డినేటర్ శ్రీనివాసులు సూచించారు. ఆలూరు ఎంపీడీఓ మీటింగ్ హాల్‌లో మంగళవారం మండలంలోని అన్ని గ్రామాల వీర్వోలు, పీఎస్‌లు, సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లతో ఎంపీడీఓ అల్లబకాష్, ఐసీడీఎస్ సీడీపీఓ లలితతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల్లో కర్నూలు జిల్లా రెండో స్థానంలో ఉందని అసంతృప్తి వ్యక్తం చేశారు. అనాగరికత, అవగాహన లేకపోవడం, పేదరికం, నిరక్షరాస్యత మూలంగా బాల్యవివాహాలు జరుగుతున్నాయన్నారు. బాల్య వివాహాల మూలంగా ఎదురయ్యే సమస్యలను ప్రజలకు వివరించాలని సూచించారు. తల్లితోపాటు బిడ్డకు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయనే విషయాలను అర్థమయ్యేలా చెప్పాలన్నారు. బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే మండల తహసీల్దార్, సీడీపీఓ, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలకు సమాచారం అందించాలన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

తుగ్గలి : గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని వైద్యాధికారిణి హరిత సూచించారు. మంగళవారం పగిడిరాయి పీహెచ్‌సీలో ప్రధాన మంత్రి మాతృత్వ సురక్ష యోజన కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. ప్రతి నెలా గర్భిణులు తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆకు కూరలు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలన్నారు.

11న మండల సర్వసభ్య సమావేశం

మద్దికెర : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 11 వ తేదీన ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి మంగళవారం తెలిపారు. ప్రజా ప్రతినిధులు, ఆయా శాఖ మండల అధికారులు ప్రగతి నివేదికలతో సమావేశానికి హాజరుకావాలని సూచించారు.

17లోపు టెన్త్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు చెల్లించాలి

తుగ్గలి : జూన్ 2నుంచి 10వతేదీ వరకు నిర్వహించే పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షకు సంబంధించి ఫీజును ఈనెల 17వతేదీలోగా చెల్లించాలని మంగళవారం ఇన్‌చార్జ్ ఎంఈవో రామవెంకటేశ్వర్లు తెలిపారు. మూడు సబ్జెక్టులు లోపు రూ.110 , అంతకు మించి సబ్జెక్టులు ఉన్న వారు రూ.125 చెల్లించాలన్నారు. సంబంధిత పాఠశాలల విద్యార్థులు హెచ్‌ఎంలను సంప్రదించి ఫీజు చెల్లించాలన్నారు. ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటలకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

సమస్యలను నిర్దిష్ట సమయంలో పరిష్కరించాలి


వీసీలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్, కమిషనర్, డీఎస్పీ, ఇతర అధికారులు

ఎమ్మిగనూరుటౌన్: ప్రజల నుండి వచ్చే సమస్యలను నిర్దిష్ట సమయంలో పరిష్కరించేందుకు అధికారులు సన్నద్ధం కావాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం ప్రారంభోత్సవం సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు సీఎం కార్యక్రమంపై దిశానిర్దేశం చేశారు. ప్రజల సమస్యలను క్రమ పద్ధతిలో పరిష్కరించి వారికి మరిన్ని సేవలు అందిచాలంటూ సీఎం సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కెఎస్ రఘు, కమిషనర్ గంగిరెడ్డి, డీఎస్పీ సీతారామయ్య, తహసీల్దార్ జయన్న, ఎంపీడీఓ బంగారమ్మ, పట్టణ సీఐ మధుసుదన్‌రావు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై ఆరోపణలు సరికాదు

నందవరం : ప్రశాంతంగా పాలన సాగిస్తున్న ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు, అసత్యారోపణలు చేయడం సరికాదని మండల వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, మండల కన్వీనర్ శివారెడ్డిగౌడ్, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు విరుపాక్షిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శివారెడ్డిగౌడ్ స్వగృహంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ టీడీపీ నేత లేకేష్ ఆధారాలు లేకుండా ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిపై ఆరోపణలు చేయడం ధారుమన్నారు. అవగాహన రహితంతో లోకేష్‌బాబు ఎమ్మెల్యేలపై రెచ్చగొట్టే ధోరణిలో ప్రసంగం కానిస్తున్నారన్నారు. చెన్నకేశవరెడ్డికి ఆలయ భూములు ఆక్రమించుకోవాల్సిన అవసరం లేదన్నారు. సమావేశంలో ఉప సర్పంచ్ చాంద్‌బాషా, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు రమేశప్పగౌడ, ముత్తన్న, భీమన్నగౌడ్, చాంద్‌తాత తదితరులు పాల్గొన్నారు.

చీలిన కొండను పరిశీలించిన అధికారులు


కొండ వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

గోనెగండ్ల: మండల కేంద్రం గోనెగండ్లలోని ఎస్సీ కాలనీలో నరసప్ప దేవాలయం దగ్గర ఉన్న కొండను విపత్తుల శాఖ జిల్లా మేనేజర్ అనుపమ, మైనింగ్ డీప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్‌లు మంగళవారం పరిశీలించారు. ఎండవేడిమికి ఏప్రిల్ 9వ తేదీ మధ్యాహ్నం ఈ కొండ చిలిపోయిన సంగతి తెలిసిందే. ఈ విషయమై ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి ఇటీవల జిల్లా కలెక్టర్ సృజనను కలిసి కొండను తొలగించి కాలనీ వాసులకు రక్షణ కల్పించాలని కోరారు. దీంతో విపత్తుల శాఖ, మైనింగ్ అధికారులు తహసీల్దార్ వేణుగోపాల్‌తో కలిసి కొండను పరిశీలించారు. కొండ రెండుగా చీలిన సంఘటనపై కాలనీ వాసులను అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ కాలనీ వాసులు ఎవరు భయపడాల్సిన అవసరం లేదని, ప్రస్తుతం కొండను పరిశీలించిన నివేదికను కలెక్టర్‌కు పంపుతున్నట్లు వారు తెలిపారు.

ఎయిడెడ్ స్కూల్‌పై చర్య తీసుకోండి

ఎమ్మిగనూరుటౌన్: అక్రమంగా డొనేషన్లు, అనుమతి లేకుండా అడ్మిషన్లు చేస్తున్న పట్టణంలోని మాచాని సోమప్ప ఇంగ్లిష్ మీడియం స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఎంఈఓ ఆంజినేయులుకు ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఆదోని డిప్యూటీ డీఈఓకు కూడా ఫిర్యాదు చేశామని ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ నాయకుడు అజిత్ తెలిపారు.

గ్రామాల్లో మెరుగైన వైద్యం


సజీవపురంలో గ్రామస్తులకు వైద్య సేవలు నిర్వహిస్తున్న డాక్టర్ సౌజన్యలత

నందవరం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ ఫిజిషియన్ విధానంతో గ్రామాల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని పీహెచ్‌సీ డాక్టర్ సౌజన్యలత పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని సజీవపురం, జోహరాపురం గ్రామాల్లో 104 ద్వారా ఫ్యామిలీడాక్టర్ విధానంతో వైద్యాధికారులు గ్రామస్తులకు వైద్య సేవలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పల్లెల్లో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, పేద ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. వృద్ధులు, గర్భిణులు, షుగర్, బీపీ వారికి వైద్య సేవలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం పుష్పావతి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రాయితీపై వేరుశనగ విత్తనాలు


రికార్డులను పరిశీలిస్తున్న మోహన్ విజయ్‌కుమార్

వెల్దుర్తి: రాబోవు ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన వేరుశనగ విత్తనాలను ప్రభుత్వం రైతులకు రాయితీపై అందించనున్నట్లు పత్తికొండ ఏడీఏ (ఆర్) మోహన్ విజయ్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక ఏఓ అక్బర్‌బాషాతో కలిసి మండల కేంద్రంలోని ఎరువులు, విత్తనాలు, మందుల దుకాణాలను తనిఖీ చేశారు. రికార్డులు స్టాకు పరిశీలించి నిబంధనల మేరకు అమ్మకాలు సాగించాలని దుకాణదారులకు సూచించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కే6 రకం విత్తనం నలభై శాతం సబ్సిడీతో ప్రభుత్వం రైతులకు అందించనున్నట్లు తెలిపారు. రూ.93 రూపాయల కేజీ విత్తనాన్ని సబ్సిడీ పోను కేవలం రూ.55.80 అందిస్తున్నామన్నారు. రైతులు సమీప ఆర్బీకేను సంప్రదించి వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు.

ఆర్బీకేల సేవలను ఉపయోగించుకోండి

ఎమ్మిగనూరురూరల్: ఆర్బీకేల సేవలను రైతులు ఉపయోగించుకోవాలని మండల వ్యవసాయాధికారి మహేశ్వరరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని బనవాసి, మల్కాపురం గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో రైతులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌బీకెల్లో విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు, ఎరువులు అందుబాటులో ఉంటాయని, కావలసిన రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని చెప్పారు. ఖరీఫ్ సీజల్లో ఎటువంటి ఎరువుల కొరత రాకుండా ఆర్‌బీకెల్లో అందుబాటులో ఉంచుతామని తెలిపారు.

విద్యార్థుల వివరాలను సేకరించాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ మోహన్‌కుమార్

కృష్ణగిరి: గ్రామాల్లో ఉండే 5 ఏళ్ల నుంచి 18 ఏళ్లలోపు ఉన్న బాలబాలికల వివరాలను మూడు రోజుల్లోగా సేకరించాలని ఎంపీడీఓ మోహన్‌కుమార్, తహసీల్దార్ పురుషోత్తం ఆదేశించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం వారు హెచ్‌ఎంలు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, సీఆర్పీలు, సీఆర్టీలతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 10నుంచి 12 తేదీలోగా అన్ని గ్రామాల్లో వలంటీర్ల కేటాయించిన ఇళ్ల వారీగా పిల్లల వివరాలను పగడ్బందీగా సేకరించాలన్నారు. ప్రతి ఇంటిలో ఉన్న పిల్లవాడు ఎక్కడ చదువుతున్నాడు, ఏ తరగతి చదువుతున్నాడు అన్ని వివరాలు సక్రమంగా సేకరిస్తే బడి బయట ఉన్న పిల్లల వివరాలు వస్తాయన్నారు. సమావేశంలో ఎంఎంఎస్ కో–అర్డినేటర్ రాజేష్, సీఆర్పీలు కృష్ణమూర్తి, వీరనాగప్ప, శ్యామలు తదితరులు పాల్గొన్నారు.

బారులు తీరారు

ఎమ్మిగనూరురూరల్: స్థానిక ప్రభుత్వాసుపత్రి గర్భిణులతో కిక్కిరిసింది. ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ కార్యక్రమంలో భాగంగా స్కానింగ్ చేయించుకునేందుకు మంగళవారం ఎమ్మిగనూరు, మంత్రాలయం, నందవరం, పెద్దకడుబూరు, కోసిగి మండలాల నుంచి పెద్ద సంఖ్యలో గర్భిణులు తరలివచ్చారు. అయితే, కొందరు వైద్య పరీక్షల కోసం గంటల తరబడి క్యూలో నిలబడలేక ఇబ్బందులు పడ్డారు. కాగా మంగళవారం 360 మంది గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు చేసినట్లు సూపరిండెంట్ డాక్టరు మైత్రేయి తెలిపారు.


స్కానింగ్ పరీక్షల కోసం పేర్ల నమోదు దగ్గర బారులుతీరిన గర్భవతులు


పరీక్షల కోసం గర్భిణులు పేర్లు నమోదు చేసుకుంటున్న వైద్య సిబ్బంది